కథానిక ◆ సి. సుజాత

# సముద్రం

**పుట్టుకతో వచ్చిన దరిద్రం, సవాలక్ష ఇంటి సమస్యలు, ఖర్చులు, వీటన్నిటికి తోడు చుట్టూ ఉన్న పురుష ప్రపంచం - వెరసి ఆమె పట్టిన దారేమిటి? అది తప్పా, ఒప్పా?**

వరలక్ష్మి ముందు గదిలో మంచం మీద పడుకొంది. ముందుకు పెంచిన వెల్లుడికి కట్టిన పిట్టగోడ సగం, మిగతా సగం జామచెట్టు, మామిడి చెట్టు కొమ్మలు కలగలిసిపోయి కనిపిస్తున్నాయి. చెట్ల కొమ్మల సందుల్లోంచి లేత నీలంరంగు ఆకాశం కాస్త కాస్త కనిపిస్తోంది. మొత్తానికి అదంతా కలిసి ఓ నిశ్చలచిత్రంలా ఉంది.

వరలక్ష్మి పడుకొనే తల వెనక్కి తిప్పి చూసింది. లోపల గదిలో మంచం మీద తల్లి పడుకొని ఉంది. నిస్సహాయంగా చేతులు, కాళ్ళు మంచం మీద పడేసినట్లు ఉందామె. మంచం పక్కనే కింద చాప మీద తమ్ముడు బోర్లా పడుకొని ఉన్నాడు. చిన్న చెల్లెలు ఎక్కడుందో కనిపించలేదు. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. వరలక్ష్మి తలతిప్పి మళ్ళీ పైకి ఆకాశం వంకకు చూడడం మొదలు పెట్టింది. వెల్లుడికి పట్టిన బూజులూ, జామ కొమ్మల రంగూ, అందుమీద పచ్చ పచ్చని ఆకులూ...

పొడుగాటి ఆకుపచ్చ చారలున్న తెల్లని చుడీదార్ వేసుకొన్న సరిత ఆ కొమ్మల మధ్య నుంచి కనిపించినట్లుంది. తల పైకెత్తి కప్పుకి వేలాడుతున్న ఫ్యాన్ వంక చూసింది వరలక్ష్మి. ఈ ఫ్యాన్‌కే అది ఉరివేసుకొంది. గిలగిల కొట్టుకొని ఉంటుందా? ఆఖరి నిమిషంలో బతకాలనిపించిందా? అసలది ఈ నిర్ణయం తీసుకోబోయే ముందు ఏం ఆలోచించి ఉంటుంది? ఆ రోజంతా పని చేస్తూనే ఉండి ఉంటుంది. ఇల్లంతా కడిగింది. సర్దింది. మంచి వంట చేసింది. అందరికీ వీలుగా కంచాలతో సహా కడిగి డైనింగ్ టేబుల్ మీద సర్ది పెట్టింది. ఆ ఉదయం తాను ఉమాపతితో కలసి ఉండడం సరిత చూడకపోతే ఇలా జరిగేది కాదేమో.

వరలక్ష్మి కళ్ళు భగ్గున మండాయి. పొడిబారిన కళ్ళు ఒక్కసారి చేతుల్తో తుడుచుకొని, 'ఏడవను నేను, కళ్ళ నీళ్ళు రానివ్వను' అనుకొంది వరలక్ష్మి.

సరిత కాలేజీ నుంచి ఆవేళకి ఎందుకు వచ్చిందో ఏమో, గబుక్కున తలుపు తోసుకొని లోపలికి వచ్చింది. ఉమాపతి లేచి బాత్‌రూమ్‌లో దూరిపోయాడు. తను పైకి జరిగి మంచం చివరి గోడకు ఆనుకొని కూర్చుంది. సరిత తనవైపు ఒకలాంటి అసహనంతో, చిరాకుతో చూసింది. ఎక్కడో లోలోపల ఒక మంట లేచింది. ఎందుకు తనవైపు అలా చూడడం?

ఉమాపతి బయటికి వచ్చి, మంచం వారని పడేసిన చొక్కా తొడుక్కొని, "ఇంక వెళతాన్రా వరలక్ష్మీ. మళ్ళా కలుద్దాం. బై సరితా" అన్నాడు ఏమీ జరగనట్లు.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అతను వెళ్ళిపోయాక ఇద్దరం బొమ్మల్లా కాసేపు కూర్చున్నాం. సరిత వైపు చూసింది తను. అమ్మాయి ముఖం ఎర్రగా ఉంది. కళ్ళలో నీళ్ళు కారుతున్నాయి. పెదవులను పళ్ళతో బిగించి ఏడుపు ఆపుకొంటోంది.

"ఏడుపెందుకు?" కసిరింది తను.

"అక్కా..." అన్నది సరిత.

చాలాకాలం నుంచి, సంవత్సరాల తరబడి దాచిపెట్టిందేదో, లోపల కుములుతున్నదేదో గబుక్కున చితుకుల మంట అంటుకొన్నట్లు పైకి లేచింది. తనకు తాను చెప్పుకొందో, సరితకు చెప్పిందో అర్థం కాలేదు ఇప్పటికీ.

"అవునే సరితా, నీకెన్నేళ్ళు? ఇరవై రెండు వచ్చాయి కదూ. నాకు ముప్పై ఎనిమిది. సరిగ్గా నీ వయసులో ఉద్యోగంలో చేరానా! రెండేళ్ళు బాగానే ఉంది. మొదటిసారి సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో గొడవయింది. నువ్వు చిన్నదానివి. ఇంట్లో అందరికీ చెప్పుకొన్నా - అతనితో ఇబ్బందిగా ఉందని, మాటిమాటికీ ట్రాన్స్‌ఫర్ అని బెదరిస్తున్నాడని. సరిగ్గా అప్పుడే నాన్న రిటైర్‌మెంట్. ఉద్యోగ విరమణ తప్ప పైసా డబ్బులు రాలేదు. "అన్నీ లోన్లే కదా. ఆయనకొచ్చేది ఇక పదిహేను వందల రూపాయల పెన్షన్" అంది అమ్మ. వంటింట్లో పీటేసి అన్నం పెట్టి నాకు ఎన్నో చెప్పింది. "తమ్ముడికి ఇంకా ఉద్యోగం రాలేదు. ఇంకా ఇద్దరు ఆడపిల్లలు చదువుకొంటున్నారు. ట్రాన్స్‌ఫర్ వస్తే కష్టం. శ్రీరామ్ గారితో గొడవలు పెంచుకోకు" అంది.

వరలక్ష్మి పక్కకు తిరిగి పడుకొంది. కళ్ళు తడిసినట్లున్నాయి. 'చాలా గొప్ప విషయం. తాను గొడవ తెచ్చుకొందా, అతను ఇబ్బంది పెడుతున్నాడా? అయినా, అదే మొదటిరోజు. తన జీవితంలో గుర్తుంచుకోదగిన రోజు.' అకౌంటెంట్ రాంబాబు పెళ్ళి. శ్రీరామ్‌గారు కారులో వచ్చారు. పదకొండు గంటలు దాటిపోయింది. భోజనాలయ్యాక ఎవరైనా వస్తానంటే డ్రాప్ చేస్తానన్నారు.

"వరలక్ష్మిని దింపేయండి సార్! మేం కాస్త ఖుషీచేస్తాం" అన్నారంతా.

తనకీ ఇబ్బందిగానే ఉంది. తనొక్కతే ఆడపిల్ల. వాళ్ళంతా పెళ్ళయిపోగానే ఆ హాల్లో దుప్పటి పరిచి పేకాట మొదలుపెట్టారు. పైన గదిలో తినేందుకు, తాగేందుకు ఏర్పాట్లవుతున్నాయని అన్యాపదేశంగా చెప్పారు కూడా. ఇక తను మాట్లాడకుండా శ్రీరామ్‌గారితో కారెక్కింది. రోజూ ఆఫీసులో ఆయనతో గొడవ. అట్లాంటిది ఆ రాత్రివేళ కార్లో ఆయన పక్కన కూర్చొని కబుర్లు చెప్పాలన్నా ఏం తోచనేలేదు. కారు నిర్మానుష్యంగా ఉన్న వీధుల వెంట తాపీగా వెళుతోంది.

"చెప్పు, ఏవిటీ ఆలోచిస్తున్నావ్?" శ్రీరామ్ తనవైపు నవ్వుతూ చూస్తున్నాడు.

తను మాట్లాడలేదు.

ఆయన చేయి తన భుజాల చుట్టూ పడింది. "నాన్న రిటైర్ అయ్యారు కదా! నాకు తెలుసురా. నువ్వు హ్యాపీగా ఉండు, నేనంతా చూసుకొంటాగా. ఊరికే ఆవేశం నీకు. కాస్త తగ్గించుకో, ఎకౌంట్స్‌కి పంపేస్తాను. జీతం పెరుగుతుంది. పని తగ్గుతుంది. ఇలా చూడు..." ఆయన గడ్డం పట్టుకోబోయాడు.

ఒక్క చీత్కారంతో ఆ చేయి తీసి పడేసింది తను. ఒళ్ళంతా ఆవిర్లొచ్చాయి.

"నేనిక్కడ దిగిపోతాను" అంది పెద్ద గొంతుతో.

శ్రీరామ్ మళ్ళీ నవ్వాడు.

"ఓ.కె, ఓ.కె, వెళ్ళిపోదువు. రిలాక్స్ బేబీ రిలాక్స్." చేత్తో తొడ మీద తట్టాడు. తొడ మీద ఏదో మంట లేచినట్లయింది. కారు ఇంటి ముందుకు రాగానే తను గబుక్కున దిగింది. శ్రీరామ్ వంగి కారు తలుపు తీస్తూ, "థ్యాంక్స్ చెప్పవా" అన్నాడు. తను చెప్పలేదు. ఒక్క విసురున మెట్లెక్కింది.

'ఉద్యోగం మానేస్తాను' అనుకొంది గట్టిగా.

తలుపు కొడుతూ ఉండగానే తెరుచుకొంది. ఎదురుగా మంచం మీద నాన్న పడిపోయి ఉన్నాడు. తను గుమ్మం లోపలికి అడుగుపెడుతూనే అమ్మ, పిల్లలు ఘొల్లుమన్నారు. ఈ హడావిడికి శ్రీరామ్ గారు కారు దిగి వచ్చారు. ఇక హాస్పిటల్‌లో నాన్నని జాయిన్ చేయించడం, ఆఫీసులో అడ్వాన్స్‌లు, సెలవులు. శ్రీరామ్‌గారి సహాయం అందుకోక తప్పని సరి. ఆ నెలాఖరులోనే తనను ఎకౌంట్స్‌కి మార్చారు శ్రీరామ్. జీతం, ఓ.టీలు... ఆయన చాలా ఆదుకొన్నారు. చాలాసార్లు వీధుల్లో ఆయన కార్లో రాత్రిళ్ళు వెళ్ళ వలసి వచ్చింది. అమ్మకు చెప్పుకోవాలనిపించినా ఏమని? తనని చూస్తూనే ఏ మందు చీటీనో, ఏ సరకుల లిస్టో చేతికిచ్చేస్తే ఇంకేమని చెప్పుకోను!

తమ్ముడు డిగ్రీ అయ్యాక బిజినెస్ చేస్తానన్నాడు. కాంట్రాక్ట్ వర్క్ చేయడం కోసం కాలేజీలో చదివేటప్పుడే ఒక కాంట్రాక్టర్ దగ్గర పార్ట్ టైమ్ చేసేవాడు. అది వాడికి నచ్చింది. సొంతంగా మొదలు పెట్టాలని అన్ని ఏర్పాట్లూ చేసుకొన్నాడు.

"ఈ కాంట్రాక్ట్ వస్తే అంతా ఒడ్డున పడిపోతామక్కా! ఆ ఎకౌంట్స్ ఆఫీసర్ నీ దోస్తే కదా. ఓ మాట చెబితే పనయిపోతుందే."

శాస్త్రి ఎదురుగా కూర్చోవడం రెండో అధ్యాయం. "ఇతనితో ఇప్పుడు నువ్వు తీసుకొంటున్న చనువు ఎంతదూరం పోతుందో చూడు. ఈ పని కోసం నువ్వేం చేస్తున్నావో ఆలోచించు" అంటూ మనసు నిర్వీరామంగా చెప్పింది. కానీ, తమ్ముడు నిలదొక్కుకుంటే తన భుజాల మీద భారం తగ్గుతుందనే ఆశ. నాన్న రేపో మాపో అనేట్లున్నారు. ఇంటి భారం తమ్ముడు కూడా కాస్తన్నా పంచుకోకపోతే తనొక్కతే ఇరుక్కుపోతుందేమోనని భయం. ఎలాగోలా అందరూ సుఖంగా బతకొచ్చనే ఆశ. ఒక రోజు శ్రీరామ్‌తో, ఇంకోరోజు శాస్త్రితో షికార్లు. ఎంతటి మహా నటులో ఇద్దరికిద్దరూ. తనతో సంబంధం ఉందని చెప్పుకోను మొదలు వాళ్ళకే ఇష్టం లేదు. చాలా సహజంగా అన్నీ జరిగిపోతున్నాయి - ఇవన్నీ 'తప్పా? కాదా' అని ఆలోచించే తీరుబడి లేనంతగా. తప్పొప్పుల నిర్ణయం తన చేతుల్లో లేదు. స్వలాభాపేక్ష లేకుండా తనూ వాళ్ళతో ప్రేమలో పడలేదు. వాళ్ళకి అంతకంటే లేదు. ఒక అవసరం. మనిషి మనిషికీ మధ్య అవసరం ఒక్కటే మిగిలినప్పుడు మిగిలిన అనుబంధాలతో సంబంధం ఏముందీ? పైగా ఎవరైనా ఇంకో మనిషికి స్వార్థం లేకుండా ఎందుకు సాయం చేస్తారు? అసలెందుకు చేయాలి? తనకీ అంతేకదా. శ్రీరామ్ మీదనో, శాస్త్రి మీదనో వల్లమాలిన

తల పైకెత్తి కప్పుకి వేలాడుతున్న ఫ్యాన్ వంక చూసింది వరలక్ష్మి. ఈ ఫ్యాన్‌కే అది ఉరివేసుకుంది. ఆ ఉదయం తాను ఉమాపతితో కలసి ఉండడం సరిత చూడకపోతే ఇలా జరిగేది కాదేమో!





మమకారం ఎప్పుడైనా తనకి కలిగిందా? అంతా నవ్వంగా, ఎవరికీ ఏ రహస్యమూ బయటపడనంత గోప్యంగా... తను కుమారే మరి!

సరిత స్కూలు నడపడం మొదలుపెట్టింది. అది ఇంటర్‌మీడియట్ వరకూ పెరిగింది. ఎయిడ్ అవకాశం వచ్చింది. యూనివర్సిటీ నుంచి ఉమాపతిని పట్టుకొంటే పనయిపోతుందని సరితా, తమ్ముడూ ఇద్దరూ నిర్ణయించుకొన్నారు. ఉమాపతి తన క్లాస్‌మేట్. అవాళ తను ఆఫీస్ నుంచి వస్తూనే సరిత తన మీద పడిపోయింది. పని ఎలాగయినా అయిపోవాలని ఎంతసేపు చెప్పిందో. తను హాయిగా సెటిల్ అవుతానని చెప్పబోతుంటే, ఫోన్ తీసి ఉమాపతి నంబర్ కోసం డయల్ చేసింది.

ఇదంతా తను సరితతో కాదు, తనతో తానే చెప్పుకొన్నట్లు మాట్లాడింది. సరిత ఏడుస్తోంది. తనకి జాలి కలగలేదు. సరితకు మల్లే తనకీ ఏడ్వేయాలని ఉందని చెప్పుకొంది. మొదటగా శ్రీరామ్, శాస్త్రి, తరువాత తమ్ముడి బిజినెస్ దెబ్బతింటే, ఆ అప్పుల కోసం ఆశ్రయించిన ఫైనాన్స్ కంపెనీ జాన్ గురించి ప్రస్తావించింది తను. అతనూ తన కొలీగే.

చిత్రాలు: నర్సిం.

ఉద్యోగానికి రిజైన్ చేసి బిజినెస్ పెట్టాడు. ఏదో పత్రిక కూడా నడుపుతున్నాడు. తనని 'రెండు చేతులా' ఆదుకొన్నాడు జాన్. ఒక అగ్ర కులానికి చెందిన చిన్నది తన కోసం దిగిరావడం తన జీవితంలో మరచిపోలేని సంఘటన అని తనే చెప్పుకున్నాడు. తన కులం వాళ్ళకంటే తనెంతో ఉన్నతమైన సంస్కారంతో ఉన్నానని చెప్పేందుకు అతను పడ్డ తాపత్రయం, తన చేయి పట్టుకొన్నాక అతను పొందిన ఆనందం, తమ్ముడి బాకీలకు పైసా వడ్డీలేని అప్పు దొరకడం- అదంతా ఆ వేళ సరితకు చెప్పుకొంటూపోయింది. సరిత ఏడుస్తూనే అంతా విన్నది.

అమ్మ, తమ్ముడు తనకి పెళ్ళి సంబంధం కోసం వెళ్ళారని తాను విరగబడి నవ్వుతూ చెప్పినపుడు, "నవ్వకక్కా ప్లీజ్, నా గుండె పగిలిపోతుందక్కా" అంటూ సరిత కన్నీరు మున్నీరయిపోయింది.

దాన్ని ఏడిపించాలనీ, బాధ పెట్టాలనీ తానూ అనుకోలేదు. చెప్పాలి కదా మరి- ఉమాపతిని తన మంచం మీదకు ఎందుకు రానిచ్చిందో? అందుకు తన తప్పు ఎలా లేదో చెప్పకపోతే తనకి ఇన్‌సల్ట్ కాదా. ఇవన్నీ చేసినందువల్ల జీవితం ఏదైనా గొప్పగా బాగుపడిపోయిందా? అన్నీ లొసుగులే. ఈ దిగజారుడుతనంతో కూడా జీవితం ఎంత మాత్రమూ బాగైపోలేదు. ఎక్కడికక్కడ కొత్త సమస్యలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. పునాది నుంచే తమతోపాటు పెరుగుతున్న దరిద్రం ఎలా తీరుతుందీ! ఇంతమంది... తను, అమ్మ, తమ్ముడు, చెల్లెళ్ళు... అందరూ ఇందుట్లోనే గిరికీలు కొట్టాలి. తినాలి, తిరగాలి. ఖర్చులు, లక్ష సమస్యలు. ఎప్పటికప్పుడు ఏదో ఆశ. ఈ పనితో తనకి కాస్త వెసులుబాటు చిక్కుతుందేమోనని ఆశ.

'ఇందుకిలా అయిపోవాలా' అని చెల్లి ప్రశ్నించిందా అని ఓసారి గుర్తు తెచ్చుకోను ప్రయత్నించింది వరలక్ష్మి. ఎక్కడా? ప్రశ్నలు వేసుకొనే సమయం ఎక్కడా? ఇరుగ్గా ఉన్న బతుకు ఇంకా ఇంకా ఎలా ఇరుకైపోయిందో. 'వీళ్ళంతా తన శరీరమే ఎందుకు కోరుకొన్నారో ఆలోచించు' అంటూ సరితకు చెప్పుకొంది తను. మళ్ళీ తనే సర్దుకొంది. నిజానికి వాళ్ళు పెట్టిన గొప్ప ప్రపోజల్ ఏమీ లేదు. పని సులువుగా అయిపోతుందన్న ఆశతో తనూ ఒక్క అడుగు ముందుకేసి ఉంటుంది కూడా. ఉమాపతి విషయంలో అదే జరిగింది. అతను ఫ్రెండ్లీగా ఉన్నాడు. తన అనుభవం దృష్ట్యా 'శరీరం' కాస్త బలంగా పనిచేస్తుందనీ, చేయిస్తుందనీ తనే ఉమాపతి దృష్టి మళ్ళించింది నిజానికి. ఇదంతా వింటూ తనవైపు నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయింది సరిత. ఆ అమ్మాయి చేతులు తన చేతుల్లోకి తీసుకొంటే చల్లగా ఉన్నాయవి. ఆ అమ్మాయి ఏడవడం మానేసింది. ఇంత జరిగినా తన బతుకు ఎందుకు బాగుపడలేదో. మూలంలోనో, ఆలోచనలోనో, ప్రవర్తనలోనో ఏదో లోపం ఉందనీ, అది తను పట్టుకోలేకపోయాననీ ఆ అమ్మాయికి చెప్పుకొంది తను. ఆ అమ్మాయి ఏదో మాట్లాడబోతే వారించింది.

"త్యాగం కాదు, ఇది త్యాగం కానే కాదు. మగవాళ్ళకి ఇలాంటి ఇబ్బంది రాదు. వాళ్ళ వ్యవహారాలు తాగుడుతో, లంచాలతో, అమ్మాయిలతో డిసైడ్ అవుతాయి. ఆడవాళ్ళ విషయానికి వస్తే మగాళ్ళు గొప్పవాళ్ళుగా కనిపించాలని పోజులు కొడతారు. లేని సంస్కారంతో, నిజంగా లేని నీతి నియమాల గురించి మాట్లాడతారు. వాళ్ళని టాకిల్ చేయడం వాళ్ళ తోటి మగవాళ్ళకి మల్లే ఆడవాళ్ళకు కుదరదు. కేవలం ఆడతనం మాత్రమే అక్కడ మిగిలిపోతుంది" అంటూ తన అనుభవం చెప్పేసింది తను. అన్ని చోట్లా ఇలాగే అవుతుందా... ఏమో! తన అనుభవం ఇదే చెప్పింది అంటూ తేల్చేసి బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది తను.


తను తల రుద్దుకొని వచ్చేదాకా సరోజ అలాగే మంచం మీద తల దించుకొని కూర్చుంది. తనకి ఏదో కసిగా అనిపించింది. చిన్న పిల్ల ముందు తల దించుకోవలసి వచ్చింది. ఇదేదో తల దించుకొనే వ్యవహారం కింద ఆ పిల్ల జమ కట్టింది మరి.

ఈ తలంటితో నా పాపం పోదు. నా మీద నాకే అసహ్యం- ఇలా ఎందరికి ఒళ్ళు అప్పగించానో తలుచుకొని. పోనీ గడిచిపోయిన రోజులన్నీ వెనక్కి తిరిగివచ్చి, నేను ఫ్రెష్‌గా నిలబడ్డా నా పరిస్థితుల దృష్ట్యా నేనిప్పటిలాగే ప్రవర్తిస్తా. అంచేత పశ్చాత్తాపపడి ప్రయోజనం లేదు. దానికి నువ్వేం చింతించక్కర్లేదు. కాకపోతే ఉమాపతితో నేన్నీకళ్ళబడ్డాను కాబట్టి ఈ ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకొన్నాను. తను ఆఖరి మాటలుగా చెప్పేసింది.

తను కంచంలో అన్నం తెచ్చుకుంది. సరిత తిననంది. తను బతిమలాడలేదు. ఏదో పగబట్టినట్లు ప్రవర్తించింది. ఎవరి మీద తన కోపం? తనకే సమాధానం లేదు.

తెల్లారి తను ఆఫీసుకు బయలుదేరుతుంటే గబగబా అన్నీ అమర్చింది సరిత. ఆ పిల్ల రోజూ ఆ పనులు చేస్తూనే ఉంటుంది. కనుక పెద్ద తేడా అనిపించలేదు. పైగా తెల్లవారి అవే కబుర్లు రిపీట్ చేయాలని అనిపించలేదు. 'అమ్మ వరకూ ఈ విషయం పోనివ్వకు' అని చెప్పాలనిపించింది. అయినా, సాయంత్రం మాట్లాడదు అనుకుంటూ ఆఫీసుకు వెళ్ళిపోయింది తను. అమ్మ వచ్చి తలుపులు నెట్టేసరికి సరిత ఉరి వేసుకుని కనిపించిందట. ఆవిడ విరుచుకు పడిపోయింది. పక్కింట్లో ఆవిడను పడుకోబెట్టి డాక్టర్‌ను పిలిచారట. అదీ సంగతి.

వరలక్ష్మి మోచేతిలో ముఖం దాచుకొంది. ఏడిస్తే బావుండని ఉంది. ఎంత పిలిచినా ఏడుపు రానిదే! గుమ్మంలో ఎవరో వచ్చిన అలికిడి. వరలక్ష్మికి లేవాలని అనిపించలేదు. తమ్ముడు లేచి వచ్చాడు. కుర్చీ లాగిన సవ్వడి. ఎవరో లోపలికి వెళ్ళి అమ్మ మంచం పక్కన కూర్చున్నారులా ఉంది. అమ్మ సన్నగా ఏడవడం మొదలు పెట్టింది. తమ్ముడు మంచం దగ్గరకు వచ్చాడు. వంగి వరలక్ష్మి చెవి దగ్గర నోరు పెట్టి, "ఉమాపతి గారొచ్చారక్కా. లేచి ఆయనతో ఏదైనా మాట్లాడు. రేపెప్పుడైనా వెళ్ళి నేను ఆ కాలేజీ సంగతి మాట్లాడతాను. ఎయిడ్ వస్తే కాస్త తెరిపిన పడవచ్చు."



ఉమాపతి విషయంలో అదే జరిగింది. అతను ఫ్రెండ్లీగా ఉన్నాడు. తన అనుభవం దృష్ట్యా 'శరీరం' కాస్త బలంగా పనిచేస్తుందనీ, చేయిస్తుందనీ తనే ఉమాపతి దృష్టి మళ్ళించింది నిజానికి.

వరలక్ష్మి ఇటు తిరిగింది. ఎదురుగ్గా గుమ్మంలోంచి కటిక చీకటి. ఏమీ కనిపించడం లేదు. చీకట్లో కలిసిపోయిన మామిడి కొమ్మలు, జామ కొమ్మలు, కదలిక కూడా లేకుండా, కనిపించకుండా పోయాయి. సహజంగా సమకూరేవి లభించకపోతే ఎన్ని ప్రత్యామ్నాయాలు లేవూ! "వరండాలో లైటు వేయి నాన్నా! బయటంతా చీకటైపోయింది..."

వరలక్ష్మి లేచింది... "ఉమాపతితో మాట్లాడితే...?" ■